'కొట్ర' టీడీపీ వ్యక్తి అని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..!

మంత్రి సీదిరికి శిరీషా సవాల్

విశాలాంధ్ర-పలాస : తల్లి కూతుళ్లపై దౌర్జన్యానికి పాల్పడిన కొట్ర రామారావు టీడీపీకి చెందిన వ్యక్తి అని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, ఇదే విషయంపై మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు చిత్తశుద్ధి ఉంటే నిరూపించాలని రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా ధ్వజమెత్తారు. బుధవారం పలాస టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హరిపురంలో తల్లి కూతురుపై ట్రాక్టర్‌తో కంకరవేసి హత్యాయత్నం చేసిన కొట్ర రామారావు తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి అని మంత్రి ఆరోపించడం తగదన్నారు. బాధితులు టీడీపీ సభ్యులు కానప్పటికీ మంత్రి అబద్దాలు నిజాలు చేయాలనే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. కొట్ర రామారావు ఎం.పి రామ్మోహనాయుడు, కళా వెంకటరావు అనుచరుడని పోటోలు మార్ఫిడిచేసి సోషల్ మీడియాలో పెట్టడంపట్ల ఆమె మండిపడ్డారు. అలాగే గతంలో జరిగిన భూ తగాదాలను రాజకీయ రంగుపులిమి, అల్లుకోల సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ రవిపై దాడి చేసిన ఘటనపై తప్పుడు కేసులు పెట్టించారని, పోలీసులు అధికార పార్టీ నాయకు లకు బానిసల్లా పని చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, గాలి క్రిష్ణారావు, బద్ద నాగరాజు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి, వంకల మాధవరావు, తమ్మినేని గంగారాం, టంకాల రవిశంకర్ గుప్తాలు పాల్గొన్నారు.

దాడుల్లో పట్టుబడిన నాటుసారా ధ్వంసం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని గత రెండేళ్లలో పట్టుబడిన 2,624 లీటర్ల నాటు సారాను ఎచ్చెర్ల పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. మొత్తం ఏడు కేసుల్లో స్వాధీనం చేసుకున్న నాటు సారాను ఎక్సైజ్ రెవెన్యూ అధికారుల సమక్షంలో ధ్వంసం చేసామని ఎస్సై వి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రహీం పాల్గొన్నారు.

గుంతల రహదారితో ప్రజల ఇక్కట్లు

పార్టీ కోసం గొప్పలు చెప్పుకుంటున్న మంత్రి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మంగళవారం జరిగిన గడపగడపకు కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మారుమూల గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, నియోజకవర్గంలో ఎక్కడ వెతికినా గోతులు కనిపిస్తే చూపండి అని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ యువ నాయకులు గొండు శంకర్ ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గార మండలం కొర్లపేట తదితర గ్రామాల్లో పెద్దపెద్ద గోతులు మయంగా ఉన్న రహదారితో ప్రజలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామస్తులు అభ్యర్ధన మేరకు తాను పరిశీలించడం జరిగిందన్నారు. కష్టం వస్తే అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, గర్భిణీ స్త్రీలు, వృద్దులకు వైద్యం కోసం

వెళ్లాంటే ఆ రహదారి వెంట వెళ్లలేని పరిస్థితి దాపురించిందని దీన్ని మంత్రి పరిశీలించా లన్నారు. ప్రభుత్వం స్పందించి విపక్షత లేకుండా అసంపూర్తిగా అధ్వానంగా వున్న రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని గొండు శంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గార తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొండు వెంకట రమణ మూర్తి, తామాడ ముకుందరావు, వంజల గోవిందరావు, మెట్ట సింహాచలం, అంబటి ఎఱ్ఱన్నాయుడు, ఎంగుల బాల, మద్దాడ గున్నయ్య, గుంటముక్కల రాజారావు, టీడీపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చోరీకి గురైన క్లాడ్ ఆయిల్ ట్యాంకర్

విశాలాంధ్ర-రేగిడి : లింగాలవలస శ్రీశ్రీనివాస ఆయిల్ మిల్లు నుంచి 22.22 లక్షల విలువచేసే క్లాడ్ ఆయిల్ లారీ చోరీకి గురైందని ఎస్సై ఈ శ్రీనివాసరావు తెలిపారు. కలకత్తాకు చెందిన డ్రైవర్ ఎస్కె అహ్మద్, ఇక్బాల్, లారీ బాడీని మార్చి వ్యాపారం చేస్తున్నా రన్నారు. రాజమండ్రికి చెందిన ఎంకె ఫారుక్ రేగిడి మండలం లింగాలవలస ఆయిల్ మిల్క్ ట్యాంకర్ పంపించారు. ఎస్సై టీం కలకత్తా వెళ్లి చాకచక్యంగా వ్యవహరించి పట్టుకుని అరెస్ట్ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జగన్నాధపురం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం జగన్నాధపురం ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో పాల్గొని విజయం సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంతయ్య తెలిపారు. విద్యార్థులు ఎంపికపట్ల ప్రధానోపాధ్యాయులతో పాటు, సర్పంచ్ జోగి రాములమ్మ, ఎంపిటిసి సవర్రాజు, పీఈటి ప్రసాదరావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బంగారు పతకాలతో మెరిసిన సిక్కోలు క్రీడాకారులు

- సిక్కోలు పేరు దేశంలో వినపడాలి
- కరాటే చీఫ్ సుమన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : విజయనగరం కొత్తవలస జిందాల్ భారతి విద్యామందిర్‌లో గంట కనకరావు మెమోరియల్ ఇన్విటేషనల్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్- 2022 పోటీలు ఒకినావా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ నిర్వహణలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా శ్రీకాకుళం స్థానిక మహాలక్ష్మినగర్ కాలనీలో శ్రీ చైతన్య పాఠశాల ప్రక్కన ఉన్న కేన్యురియో కరాటే విద్యార్థులు పతకాలతో మెరిసారని కెన్యు కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు తెలిపారు. 11 మంది విద్యార్థులు "కటా, కుమిటి "విభాగంలో పాల్గొని 20 పతకాలను సాధించారని

గోల్డ్-08, సిల్వర్-5, బ్రోన్జ్-7, మొత్తం-20, పతకాలతోపాటుగా ప్రశంసాపత్రాలను కైవసం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినీనటుడు సుమన్ తల్వార్ పతకాలను అందజేసి మాట్లాడుతూ సిక్కోలు క్రీడాకారులు మున్ముందు మరిన్ని పతకాలు తేవటంతోపాటు జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశంలోనూ వినిపించా లన్నారు. పతకాలు సాధించిన వారిలో గోల్డ్-జి. మనోహర్, జి. జానకిరామ్, ఎమ్. తనుష్, ఎం. సాయి దీక్షిత్, కె.సాయి సుశాంత్, టి.చేతన్, కె. దినేష్ శ్రీ కృష్ణ సాయి, సిల్వర్ - బి. ప్రశాంతి, అస్లాం ఖాన్, ఎస్. జయచరణ్, జి. జానకిరామ్, బ్రోన్జ్-జి.మనోహర్, బి.జోషిత, అస్లాంఖాన్, ఎస్. జయచరణ్, కె. సాయి సుశాంత్ ఉన్నారు. గెలుపొందిన వారిని కోచ్ రెడ్డి ఢిల్లేశ్వర రావుని, శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంతో పాటు ఎపి. కరాటే చీఫ్ కె.సుమన్ ప్రత్యేకంగా అభినందించారు.

దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు : మంత్రి సీదిరి

విశాలాంధ్ర-పలాస: పలాస మండలం అల్లుకోల గ్రామ సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ రవిపై ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడి చేయడంపై మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం అల్లుకోల గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అశాంతి సృష్టించి టీడీపీ రౌడీ రాజకీయాలు చేస్తుందని, అభివృద్ధి చూసి ఓర్వలేక దాడులకు పాల్పడుతున్నారని, దోషు లను విడిచిపెట్టే ప్రసక్తేలేదని అన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా తెలుగుదేశం పార్టీ వర్గీయులు పథకం ప్రకారం దువ్వాడ రవిపై దాడికి పాల్పడ్డారని అన్నారు. మంత్రితో పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టిబాబు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, మామిడి నర్సింహ మూర్తి, మచ్చ ధనరాజు, చింతాడ చింతాడ మాధవరావు, ఉంగ సాయిక్రిష్ణలు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలంటూ పంచాయతీ నోటీసులు

విశాలాంధ్ర-సోంపేట : పట్టణంలోని దగ్గచెరువు గట్టు వీధిలో ఓ వ్యక్తి చెరువుగట్టు ఆక్రమించి బాత్‌రూం నిర్మించడంవల్ల వర్షపునీరు డ్రైనేజీలోకి వెళ్లకుండా రోడ్డుమీదకు ప్రవహిస్తుండడంతో వీధి ప్రజలు పంచా యతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పలుమార్లు పరిశీ లించిన మీదట పంచాయతీ ఇఓ హరికృష్ణ సదరు ఆక్రమణదారుకు నోటీసులు జారీ చేసి వెంటనే ఆక్రమణ తొలగించాలని ఆదేశించారు. లేనియెడల పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పనిదినాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానం

- ప్రాధాన్యత భవనాలపై దృష్టి సారించండి
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ
- కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో ఈ ఏడాది ఒక కోటి 40 లక్షల పనిదినాలను కల్పించి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారని ఇదే స్ఫూర్తితో రానున్న ఐదు మాసాల్లో కల్పించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పేర్కొన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ

ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన, సమన్వయ సమావేశం జిల్లా పరిషత్ అధ్యక్షులు, కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ దినసరి సగటు వేతనాలపై ఆధారపడి ఉంటుం దని అన్నారు. కాబట్టి ప్రస్తుతం రూ.175/-లు ఉన్న సగటు వేతనాన్ని రూ.257/-లు పొందేలా మేట్స్, క్షేత్ర సహాయకులు చూడాలన్నారు. సర్పంచ్ స్థాయి నుండి జిల్లాస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేస్తే ఇది సాధ్యపడు తుందని ఆమె అభిప్రాయపడ్డారు. గతేడాది సకాలంలో పనులు చేపట్టకపోవడం వలన కొన్ని కోట్లను నష్టపోయామని, ప్రస్తుతం ఇంకా ఐదు మాసాలు గడువుఉన్నందున ప్రణాళిక ప్రకారం పనులుచేపట్టాలని సూచించారు. ఉపాధిహామీ ద్వారా చెరువులు, బోర్లు మాత్రమే పనులు చేపట్టేవారని, కాని ఇవేకాకుండా భూ అభివృద్ధి, ఉద్యానవన పంటల పెంపకం,చిన్న నీటిపారుదల పునరుద్ధరణ, అటవీకరణ, గ్రామీణ అనుసంధాలు, వరద నియంత్రణ, భూగర్భజలాల పునరుద్ధరణ, గ్రామీణ పారిశుద్ధ్యం, పశు సంబంధిత పనులు, మత్స్య సంపద అభివృద్ధి, సెరీకల్చర్ ప్లాంటేషన్, గ్రామీణ గృహ నిర్మాణ ప్రాజెక్ట్ తదితర పనులను చేపట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి ఆర్.లవరాజు, కార్యక్రమ అధికారి కె.వి.అప్పల నాయుడు, సహాయ పథక సంచాలకులు శైలజ,మురళీ కృష్ణ, అమ్మినాయుడు, శ్రీనివాసరావు, యుగంధర్, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, జిల్లాపరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల అధ్యక్షులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మానవాళికి ఆరోగ్యకరం

విశాలాంధ్ర-కొత్తూరు : మనం పండించే పంటలన్ని రసాయినిక మందుల అవశేషాలు వీటిని ఆహారంగా తీసుకోవడంవల్ల మానవాళి అనారోగ్యం పాలవుతుందని, కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు అన్నారు, బుధవారం ఆయన ఇక్కడ ఒక ప్రవేట్ కల్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక దిగుబడులు ఆశతో రసాయన ఎరువుల వాడి అన్ని పంటలను రైతులు పండిస్తున్నారు. ఇవే మనం తింటున్నాం అన్నిరకాలుగా రోగాలను కొనితెచ్చుకుంటున్నా మన్నారు. సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే అలాంటి ఆహారం వల్ల అనారోగ్య పరిస్థితులు దరిజరవు

అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఎస్.డి.ఏ బాబాజి సహకారం, పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశం లో జిల్లా ఉత్తమ రైతు ఖండాపు నారాయణరావు, కొత్తూరు మాజి సర్పంచ్, రైతు సంఘ ప్రతినిది లు లోతుగెడ్డ లక్ష్మి నారాయణ, కోయిలాపు సంజీవ్ రావు, పలువురు రైతులు పెద్ద ఎత్తున ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అయ్యో పాపం... ఆర్టీసీ

తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-సోంపేట : ఆర్టీసీ బస్సుకు సోంపేట, బారువ రహదారిలో బుధవారం ఉదయం పెద్ద ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సు వెనుకవైపు యాక్సిల్ విరిగి వెనుక చక్రాలు పక్కనే ఉన్న పొలంలోకి పరుగులు పెట్టాయి. దీంతో బస్సు వెనుక భాగం రోడ్డుపై పూర్తిగా వాలింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో బస్సులో ప్రయాణీకులంతా ఊపిరి పీల్చుకున్నారు. పలాస డిపోలో ఉన్న ఆర్టీనరీ బస్సులు కాలం చెల్లినవి కావడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణీకులతో చెలగాటమాడవద్దని నెటిజన్లు పేర్కొంటున్నారు.

అండర్-14, 17 ఎంపికలను ప్రారంభించిన దువ్వాడ

విశాలాంధ్ర-టెక్కలి : స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 విభాగంలో బాలురు, బాలికల జట్ల క్రీడాకారుల ఎంపికలను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం ప్రారం భించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనాలని, స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగం సాధించవచ్చని, స్పోర్ట్స్ ద్వారా క్రమ శిక్షణ, ఆత్మస్థైర్యం పెరుగుతుందని ప్రతి ఒక్కరు క్రీడల్లో మంచి ప్రతిభకనబరిచి పతకాలు సాధించి ఉన్నత స్థితికి వెళ్లాలని ఆకాంక్షించారు. అనం తరం గేమ్స్ నెట్ బాల్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, రూఫ్ స్కిప్పింగ్ గేమ్స్‌లో ఎంపిక కాబడిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈయనతో పాటు ఎంపీపీ సరోజనమ్మ, సర్పంచ్ సుజాతమ్మ, ఉప సర్పంచ్ గుండెల సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, కెకె రామ్‌రెడ్డి, పి.తిరుపతి రావు, జగ్గమ్మ, ఆదిశేషు, పి.వి.రమణ. వాసుదేవ రావు, లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ, కృష్ణ శ్రీను, శ్యామల రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఓటు హక్కు ప్రాముఖ్యత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నిక అధికారి శ్రీకేష్ లాఠకర్ పేర్కొన్నారు. స్థానిక బాపూజీ కలామందిర్‌లో ఏర్పాటుచేసిన స్వీప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో కలె క్టర్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లా జనాభా 28 లక్షలు అయితే 18 లక్షలు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఓటు హక్కు వినియోగించనివారికి మనం అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. ప్రతిఓటు చాలా కీలకమన్నారు. స్వీప్ కార్యక్రమ నిర్వహణ ముఖ్య ఉదేశ్యం మీ ద్వారా మీ చుట్టూ ప్రక్కల ఉన్న వారికి అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమం చేపట్ట దం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాల్లో యువత ప్రధానపాత్ర పోషించాలన్నారు, ఓటు హక్కు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో ప్రతిఒక్కరూ తెలుసుకోవా లని, ఇందుకు సంబం ధించిన విధివిధానాలు, ఆన్లైన్లో దరఖాస్తు విధానంపై అల్ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యకమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బొడ్డేపల్లి శాంతి, తహశీల్దార్ కె.వెంకటరావు, స్వీప్ డైరెక్టర్, విద్యాసంస్థలు అధినేత జామి భీమ శంకరారావు, స్వీప్ స్వచ్ఛంద సంస్థ మూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారి సీతారాం వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర-పొందూరు : అత్యవసర పరిస్థితుల్లో ఆపదలో ఉన్న రోగులకు రక్తదానం చేసి నేటి యువత ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు కాళ్లకూరి శాంతరాం యువతరానికి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతూ పై విధంగా అన్నారు. నేటి యువత మానవతా దృక్పథంతో తోటి మనిషిని ఆదుకునే ఆలోచనతో మెలగాలని ఆయన అన్నారు. ప్రిన్సిపాల్ రామ్ మనోహర్ మాట్లాడుతూ ప్రతి రెండు సెకండ్లకు ఎవరో ఒకరికి రక్తం అవసరం ఉంటేనే ఉంటుందన్నారు. ప్రమాదానికి గురైన వారు శస్త్ర చికిత్స రోగులకు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు. రక్తదానం ప్రయోజనాల గూర్చి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి లెక్చరర్ పి.వెంకటరావు, రాజేశ్వరి, మల్లేశ్వరరావులతో పాటు రెడ్‌క్రాస్ ప్రతినిధులు కే.రాజేష్, సత్యనారాయణ, పవన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల రహదారులు మెరుగుపరచాలి

ఎంపీడీవోకి జనసేన నాయకుల వినతి

విశాలాంధ్ర-కవిటి : మారుమూల గ్రామాలకు రహదారులు మెరుగుపరచాలని ఎంపీడీవో కార్యాలయంలో ఏవో జి.జయంతి ప్రసాద్‌కు ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో జనసైనికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవిటి మండలంలోని బి.గొనప పుట్టుగ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న తుంగానపుట్టుగ, గుమ్మడి పుట్టుగ, తడక పుట్టుగ, లొట్టి పుట్టుగ, పద్రి పుట్టుగ, బంజు పుట్టుగ, చెవిటిపుట్టుగ గ్రామాలలో మట్టి రోడ్డు (కంకర రోడ్డు) అధ్వాన్న స్థితిలో నరకాన్ని తలపించేటట్లు ఉన్నాయని అన్నారు. రోడ్లు మొత్తం గుంతలు, ఇసుక కూరుకుపోవడంతో కనీసం మోటార్ సైకిల్ వెళ్లేందుకు కూడా సౌకర్యం లేదని, దీనివల్ల ఆ గ్రామప్రజలు చాలా అవస్థలకు గురవుతున్నా రని తెలిపారు. గర్భిణీ స్త్రీలు రాకపోకలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం నిమిత్తం అంబులెన్స్ రావడానికి కూడా రోడ్లు సరిగాలేవని తెలిపారు. ఈ విషయాన్ని ఆ పంచాయతీలోని జనసైనికులు ఇచ్ఛాపురం జనసేన ఇంఛార్జి దాసరి రాజు దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ఈమేరకు బుధవారం బి.గొనపపుట్టుగ పంచాయి తీలో పలు గ్రామాల్ని సందర్శించి రోడ్ల దుస్థితిని పరిశీలించారు. బాధిత గ్రామాల ప్రజలతో మాట్లాడి సంతకాలు సేకరించారు. బి.గొనప పుట్టుగ పంచాయితీలో గల 6 గ్రామాలతోపాటు చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు రోడ్లు సరిగాలేక పడుతున్న అవస్థలు గుర్తించి అధికారులదృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, కుసుంపురం సర్పంచ్ అభ్యర్ధి అంగ సురేష్, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 10 వార్డు ఇంచార్జ్ రోకళ్ళ భాస్కర్, బడగల రామకృష్ణలోల్ల సాగర్, నర్తు కృష్ణ, జనసేన శ్రీకాకుళం ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూగాన దివాకర్, హేమాచలపతి, దేవా, రాజశేఖర్, శ్యామ్, ధనుంజయం, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన క్రీడాకారులు

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి క్రీడా వికాస కేంద్రానికి చెందిన టైక్వాండో క్రీడాకారులు శ్రీకాకుళం టౌన్ హాల్ లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలలో సత్తా చాటారు. అండర్-14 స్కూల్ గేమ్స్ పోటీల్లో కె.తాస్వి, వి.మోస్వంత్ లు ఎంపిక కాగా అండర్- 17 విభాగంలో బాలికలలు పి. జాశ్విక, ఆర్. హాసిని, ఎన్. సంజన అండర్ 17 విభాగంలో బాలురు ఎస్. అభిషేక్, ఎన్.గణేష్‌లు ఎంపికయ్యారని కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎంపిక పట్ల డిఎస్ డిఒ మాధురి లత, సెట్ సిఈఓ ప్రసాద్ రావు క్రీడాకారుల కు అభినందనలు తెలిపారు.

అర్హులందరూ ఓటు హక్కును పొందాలి

ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ నవ్య

విశాలాంధ్ర-సీతంపేట: మండల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి బైక్ ర్యాలీ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గం ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ బి నవ్య పాల్గొని 18 సంవత్సరాల పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందాలని తెలిపారు. సీతంపేట సంత మార్కెట్ నుండి ఐటిడిఏ కార్యాలయం వరకు తాసిల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది బైక్ ర్యాలీని నిర్వహించి విజయవంతం చేశారు

స్వీప్ ఏక్టివిటీ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఆర్ఐ-2 రమేష్, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం నివగాం రోడ్డు మహర్తపురం సమీపంలో జరిగిన బైక్ ఎక్సిడెంట్‌లో చింత పల్లి కృపారాణి (16) అనే ఇంటర్మీడియట్ విద్యార్థిని అక్కడకక్కడే మృతి చెందింది. వివరాలు ఇవి... పాతపట్నం కు చెందిన ఓ ప్రేవేట్ కాలేజ్ లో కృపారాణి చదువుతుంది. ఆమె స్వగ్రామం కూడా అదే గ్రామం బుధవారం పాతపట్నం దరి కొరసవడా గ్రామానికి చెందిన తాటికొండ శ్యాం అనే అనే అబ్బాయి తో బైక్ పై సీతంపేట పార్క్ కు చూడడానికి కృపారాణి వచ్చింది. తిరుగు ప్రయాణంలో మహర్తపురం వద్ద ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్ ను ఓవర్ టెక్ చేసే ప్రయత్నం లో బైక్ అదుపు తప్పి ప్రమాదం జరిగింది. కృపారాణి తలకు బలమైన గాయం కావడంతో అక్కడక్కడే ఆమే ప్రాణాలు కోల్పోయింది. బైక్ నడు పుతున్న శ్యాం కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్యాం నుండి స్టేట్మెంట్ నమోదుచేసి శవాన్ని పోస్ట్ మార్టం కోసం పాలకుండా ఏరియా ఆస్పత్రికి తరలించారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ ఐ సింహాద్రి తెలిపారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం

ఎమ్మెల్యే కళావతి

విశాలాంధ్ర-పాలకొండ : నిరుపేదల వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ బ్రతుకునిస్తుందని ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి పేర్కొన్నారు. బుధవారం వండవ తన క్యాంపు కార్యాలయంలో వీరఘట్టం గ్రామానికి చెందిన నిరుపేదలు గొలుసు రూపవతి కొద్ది నెలల క్రితం మోకాళు వద్ద పెద్ద ఆపరేషన్ జరగడంతో సుమారు రూ.లక్ష ఖర్చు అయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కళావతి తెలుసుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాయడంతో సీఎం రిలీఫ్ ఫండ్ రూ.75వేలు మంజూరు చేయడం జరిగింది. ఆ చెక్కును ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా లబ్దిదా రులు సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గెలుపు దిశగా పనిచేయాలి

విశాలాంధ్ర-భామిని: రానున్న ఎన్నికల్లో గెలుపు దిశగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం వన్‌టూవన్ సమీక్షలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయక్రిష్ణ బుధవారం విజయవాడలో నిర్వ హించిన వన్‌టూవన్ సమీక్షలో పాలకొండ నియోజక వర్గంలో రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతం చేసి గెలుపు దిశగా పనిచేయాలని, పార్టీ సభ్యత్వ నమోదు చురుకుగా చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్య లను నేరుగా తెలుసుకోవాలని సూచించినట్లు ఇన్‌ఛార్జ్ విశాలాంధ్రకు తెలిపారు.

జంపరకోట రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పాలకొండ : యుద్ధప్రాతిపదికన జంపకోట రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లాల కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం బృందంతో కలిసి జంపరకోట రిజర్వాయర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా జంపర కోట రిజర్వాయర్ పరిధిలో పెద్దగెడ్డపై 1988లో రెండుకోట్ల ఏభైఐదు లక్షల పదివేలు రూపాయిలు అంచనా వ్యయంతో ప్రారంభించిన రిజర్వాయర్ నేటికి సుమారుగా 34 సంవత్సరాలు పూర్తైనప్పటికీ కేవలం పాలకుల నిర్లక్ష్యం వల్లే కావాల్సిన నిధులు మంజూరుకాక రిజర్వాయర్ పనులు పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానంగా స్థానిక నాయకులు కనీసం రిజర్వాయర్‌ను పట్టించుకున్న పాపానికిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రైతులు వర్షాధారంమీదే పంటను సాగుచేయాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో 2006లో హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేయగా అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టుకు కావాల్సిన నిధులు మంజూరు చేశారని, కానీ గుత్తేదారు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో రిజర్వాయర్ గట్టు పాక్షికంగా పూర్తి అయినప్పటికీ హుదూద్ తుఫాన్ కారణంగా రిజర్వాయర్‌లో ఉన్న నీరు ఉన్న పలంగా పెరగడంతో గట్టుపైనుంచి వరద ప్రవహించడంతో పూర్తి గట్లు పోయాయని, ఆ నాటి నుంచి ఈ నాటి వరకు ఓ ఒక్క నాయకుడు కూడా పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం తాజా అంచనాల ప్రకారం రూ.25కోట్ల 78లక్షలు అవసరం అవుతుందని అంచనా వేశారు. కావున ప్రభుత్వం వెంటనే

స్పందించి కావాల్సిన నిధులు మంజూరు చేసి ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం మంది గిరిజనులు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, తాగు, సాగునీరు లేక అల్లాడిపోతున్నారని, రిజర్వాయర్ పనులు పూర్తి చేసి గిరిజనుకు వారి వ్యవసాయ రంగానికి తోడ్పాడాలని కోరారు. జిల్లా లో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి. అప్పలనాయుడు, వి. కూర్మారావు, సీహెచ్ చంద్రయ్య, వి. భీమలింగం, ఎన్. చుక్కయ్య, సీహెచ్ పంతులు, నాగేశ్వరరావు, ఎ. అప్పారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుందరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: క్రీడలతోనే విద్యార్థులకి ఉజ్వల భవిష్యత్ ఉంటుం దని శ్రీకాకుళం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.సుందరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంద న్నారు. ప్రతి ఒక్కరు క్రీడలలో రాణించేందుకు ముందుకురావాలన్నారు. శ్రీకాకుళంలోని టౌన్ హాల్ వేదికగా బుధవారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో, ఫెన్సింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి తెక్వాండో, ఫెన్సింగ్ పోటీలను ఆయన స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, జిల్లా పిడి, పిఇటిల అసోయేషన్ అధ్యక్షుడు ఎం.వి.రమణ, కార్యదర్శి సాంబమూర్తి తదితరులతో కలిసి ప్రారంభించారు. అండర్ 14, 17 విభాగాలలో ఈపోటీలను వేర్వేరుగా నిర్వహించారు. అనంతరం సుందరరావు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్ని క్రీడలకు సంబందించిన జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుంద న్నారు. క్రీడాకారులలో దాగిఉన్న ప్రతిభా పాటవాల ను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఈపోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడాకారులు మెలకువలను నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ చదువుతోపాటు విద్యార్థులకి క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలద్వారా క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌గా ఉండేందుకు దోహదపడతాయన్నారు. జిల్లా పిడి, పిఇటిల అసోయేషన్ అధ్యక్షుడు ఎం.వి.రమణ, కార్యదర్శి సాంబమూర్తిలు మాట్లాడుతూ జిల్లాలో తైక్వాండోతో పాటు ఫెన్సింగ్ పోటీలను టౌన్‌హాల్ వేదికగా కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడలకి ఆదరణ పెరుగుతుందని నిపుణులైన కోచ్‌లు ఉన్నారన్నారు. జిల్లాస్థాయి పోటీలలో తైక్వాండో క్రీడాకారులు సత్తాచాటడంతోపాటు రాష్ట్ర స్థాయిలో కూడా జిల్లా పేరు ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలన్నారు. ఈకార్యక్రమంలో పిడి,పిఇటీల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పోలినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నిర్మల్ కుమార్ ,హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ శేఖర్, దళిత సంఘాల జెఎసి నేత కంఠ వేణు, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తైక్వాండో శ్రీను, జిల్లా ఫెన్సింగ్ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్, పిడి,పిఇటిలు ఎం.ఆనంద్ కిరణ్, ఆర్.హరిష్ నాయుడు, కె.మాధవరావు, డి.భవానీ, పి.సునీత తదితరులు పాల్గొన్నారు. తైక్వాండో, ఫెన్సింగ్ కోచ్‌లు జోగిపాటి వంశీ, తైక్వాండో గౌతమ్, నవీన్, సతీష్, మదన్, జాస్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సమన్యాయం అందాలి

- కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి అందరూ సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవ కార్యక్రమం జిల్లా కోర్టుల సముదాయంలోని న్యాయ సేవా సదన్ భవనంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా గతంలో కంటే ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల్లో నాణ్యతతో పాటు సత్వర న్యాయ పరిష్కారం కావాలన్నారు. పేదప్రజల తరుపున వాదించడానికి ప్రతి న్యాయవాది ముందుకు రావాలన్నారు. మెరుగైన న్యాయం అందించాలంటే కేసులకు

సంబంధించిన మూలాలను తెలుసుకొని ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. తొలుత న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ తో కలిసి ప్రారంభించి తిలకించారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభమైనప్పటి నుండి అందరికీ సమన్యాయం సులభతరం అయిందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. న్యాయ సేవా చట్టాలు వచ్చిన తరువాత న్యాయ వ్యవస్థలో పలు మార్పులు వచ్చాయన్నారు. ప్రజలకి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వచ్చిన నాటి నుండి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం అవుతున్నాయని, ఇది శు భ పరిణామమని కలెక్టర్ ఈ సందర్భంగా కొనియాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం లోక్ అదాలత్‌లో చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు, న్యాయ సహాయానికి సంబంధించిన నివేదికను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తులు -1,2,3 వరుసగా టి. వేంకటేశ్వర్లు, జి.చక్రపాణి, కె.శ్రీదేవి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మెన్ జి.సువర్ణ రాజు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. ఫల్గుణరావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో యువ నేత సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-అరసవల్లి : స్థానిక పీఎన్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యువనేత ధర్మాన రామ్‌మనోహర్ వరకు విచ్చేశారు. కార్య క్రమంలో భాగంగా గడపగడపకు ప్రజలవద్దకు వెళ్లి, సంక్షేమ పథకాలు వస్తున్నాయా లేదా అని అడిగిమరీ తెలుసు కున్నారు. వాలెంటీర్స్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఇంటి ఇంటికి వచ్చి సంక్షేమ పథకాల వివరాలు తెలియజేస్తు న్నారా అని గ్రామస్థులను అడిగి తెలుసు కున్నారు. ప్రజలతో మమేకంగ కలిసి మాట్లాడి గత ప్రభుత్వంకు, ప్రస్తుత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ లేకుండా, మధ్యవర్తి లేకుండా, లంచాలు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పైడి రాజారావు, గుంట జ్యోతీ, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రస్తుత సామాజిక పరిస్థితులను బాలికలు ఎప్పటికప్పుడు గమనిస్తూ, భవిష్యత్ లక్ష్యసాధనకు ప్రయత్నించా లని బార్ అసోసియేషన్ కార్యదర్శి, మండల న్యాయ సేవా సంఘం రిటైనర్ అడ్వకేట్ నాగరాజు పాత్రో అన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కాదా లక్ష్మి కాంతం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు ను మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు గగనకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సామాజిక అంశాలపట్ల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చట్ట పరిధిలో బాలికలు, మహిళలు తగిన రక్షణ లభిస్తుందని, పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని నిలవాలని అవసరం మేరకు మండల న్యాయసేవా సంఘం సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. విద్యార్థి దశలో తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, బాలికల పట్ల వేధింపులు, మహిళలకు పని ప్రదేశాల్లో, ఇళ్ళలో వేధింపులు, ఫిర్యాదులు రక్షణ, పరిహారాలు పొందే విధానం, పోక్సో, పలు చట్టాలను వివరించారు. సచివాలయాల మహిళ రక్షణ విభాగం కార్యదర్శులు సూర్య కుమారి, ఉషారాణిలు మాట్లాడుతు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గూర్చి వివరించి, మహిళ రక్షణ కార్యదర్శుల సహకారం పొందే విధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మురళి బెహరా, మండల న్యాయసేవా సంఘం సిబ్బంది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించుకోవాలి

వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : జాతీయ సమైక్యత భావం పెంపొందించుకునేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరాలు దోహదపడతాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ తరపున కురుక్షేత్ర యూనివర్సిటీ హర్యానా ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 18 వ తేదీ వరకు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొంటున్న వాలంటీర్లను అభినందించారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం అనురాధ మాట్లాడుతూ ఈ శిబిరంలో వర్సిటీ తరపున ఈ ప్రకాష్ బాబు ప్రోగ్రాం ఆఫీసర్ వాలంటీర్లు వి శివరామకృష్ణ , ఏ కౌశిక్ వట్నాయక్, ఎస్ గణేష్, కే శ్రీనివాసరావు, ఎం భార్గవి, టి లలిత, బి రంజని, పి మాలతి, కే భాగ్యశ్రీ పాల్గొంటున్నారని చెప్పారు

క్షౌరవృత్తికి పేటెంట్ హక్కు కల్పించాలి

నాయీ బ్రాహ్మణుల సంఘం ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రిలయన్స్ సంస్థ ఆరు వేల సెలూన్లు దుఖానాలు పెట్టి క్షౌర వృత్తిదారుల పొట్ట కొట్టడానికి ముందుకు రావడం దుర్మార్గమని శ్రీకాకుళం జిల్లా నాయీబ్రాహ్మణుల సంఘం ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ రిలయన్స్ సెలూన్ షాపుల ఏర్పటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సెలూన్ షాపుల ఏర్పాటుల అనుమతులను వెంటనే నిలిపివేయాలన్నారు. అనాదిగా నాయీబ్రాహ్మణ క్షౌరవృత్తి పై వృత్తిదారులకు ప్రభుత్వం వెంటనే పేటెంట్‌హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిలయన్స్ సంస్థకు సెలూన్లు షాపులు పెట్టుకోవడానికి అనుమతి ఇస్తే వాటీని ధ్వంసం చేయడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. జిల్లాలో 99శాతం మంది నాయీబ్రహ్మణలు ఈ వృత్తిపైనే ఆదారపడి జీవిస్తున్నారని ఈవిషయం ప్రజాప్రతినిధులు దృష్టిలో పెట్టుకొని రిలయన్స్ సంస్థకు అనుమతులు ఇవ్వకుండ చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయిబ్రాహ్మణలు ఉన్నారు.

మంచి జరిగితేనే మాకు ఓటు వెయ్యండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హిరమండలం : మీకు మీ ఇంటికి మీ గ్రామానికి మీ వార్డు కు రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి మంచి చేస్తేనే రానున్న 2024 సంత్సరం లో జరుగుఎన్నికల్లో ఓటు వేసి మళ్ళీ జగనన్న ను సీఎం చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. బుధవారం మండలా ఇంద్రమైన హిరమండలం 1 సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే శాంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాంతి గడప గడప కు వెళ్లి ప్రజలు అందుకుంటున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకుంటు న్నారా లేదా అని అరా తీశారు. రాష్ట్రంలో మునుపెన్నడు లేని విధంగా పార్టీలకతీతంగా మా నాయకులు ప్రమేయం లేకుండా సీఎం లెక్కలేనన్ని పథకాలు అందజేస్తున్నారని 175 అసెంబ్లీ స్థానాలు గెలిపించి జగనన్న రుణం తీర్చుకోవాలని ప్రతీ ఓటర్ కు ఎమ్మెల్యే శాంతి వేడుకున్నారు,

ఎమ్మెల్యే వెంట పిఎసిఎస్ అధ్యక్షులు అంధవరం వెంకట్ సురేష్, వైస్సార్సీపీ మండలఅధ్యక్షులు మీసాల రామకృష్ణ, సర్పంచ్ దేవుదల సుందరమ్మ పోలయ్య వార్డు మెంబెర్‌లు, బూర లచ్చయ్య గొర్లె సురేష్, తోనింగి తవుడు, పొట్నూరు లక్ష్మి, టి మాధవ రెడ్డి, ఎంపీటీసీ తట్ల శంకర్ రావు,మండలకో అప్షన్ మెంబెర్ విష్ణు ప్రసాద్ పండా,ఎంపీడీఓ బి శైలజ, ఈఓ పి రాంబాబు, ఏ నర్సింగ్‌రావు, నాయకులు కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమలో నైపుణ్యాల పెంపుదల అవసరం

విశాలాంధ్ర-పొందూరు : భారతీయ సంస్కృతి వారసత్వ సంపదలో ఖాదీ వస్త్రధారణ ఒక అంతర్భాగమని, చేనేత పరిశ్రమను కాపాడుకోవ లసిన బాధ్యత మనందరిపై ఉందని సమన్వయకర్త, భారత జాతీయ కళలు మరియు సంస్కృతి వారసత్వ సంస్థ, (ఇంటాక్) న్యూఢిల్లీ, శ్రీకాకుళం చాప్టర్ ఏల్. సన్యాసిరావు అన్నారు. పొందూరు లో ఇంటాక్ ఆధ్వర్యంలో జరిగిన "చేనేత పరిశ్రమలో నైపుణ్యాల పెంపుదల సదస్సు" లో అయన పాల్గొన్నారు. కె.వి జె రాధాప్రసాద్, పూర్వ కన్వీనర్ ఇంటాక్ మాట్లాడుతూ చేనేత వస్త్రాల నేత కార్మికుల ఆర్థిక స్థితి నానాటికి దిగజారుతుందని, వస్త్రాల ధరలు పెరుగుతున్నప్పటికీ కార్మికులకు పనికితగ్గ వేతనం లభించడం లేదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ విశ్వ విఖ్యాతి చెందిన పొందూరు సన్నఖాదీ వస్త్రాలు అందానికి,

హుందాతనానికి, ఆరోగ్యానికి, మన్నికకు గుర్తుగా నిలుస్తాయని, అటువంటి వస్త్ర పరిశ్రమలో పని చేస్తున్న చేనేత కార్మికులకు మరింత మెరుగైన నైపుణ్యాలను అందించి, సన్నఖాదిని పోటీ ప్రపంచంలో ఆదుకోవాలన్నారు. నటుకుల మోహన్ మాట్లాడుతూ పొందూరు చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న చేనేత కార్మికులు వారి అభిప్రాయాలు వెలుబుచ్చుతూ ఈ కుటీర పరిశ్రమ, తమ తరంతోనే అంతరించి పోతుందేమో అన్న ఆందోళన వెలిబుచ్చారు. ఈ వృత్తి గిట్టుబాటు కాకపోవడంతో నేటి యువత వేరే వృత్తులను ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిల్లిపాది రోజంతా శ్రమించి ఒక పాట్నాలు వస్త్రం నేత చేస్తే ఒక్కొక్కరికి రోజుకు మూడు వందలు కూడా రావడం లేదన్నారు.చేనేత కుటుంబాల వారీగా జియో ఐడెంటిటీ టేగింగ్ జరపవలసిన అవసరం ఉందన్నారు. అమ్మకందారులు పొందున్న లాభం అధికంగా ఉంది, కాని తమకు వృత్తిదారుగా ప్రయోజనం తక్కువగా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమను ఆదుకుంటోందని లేకుంటే ఆర్థికంగా మరింతగా చితికి పోయేవాళ్లమన్నారు. అధిక సంఖ్యలో చేనేత కార్మికుల పాల్గొన్న ఈ సదస్సు తర్లాడ అప్పలనాయుడు మెంబర్ ఇంటాక్ వందన సమర్పణతో ముగిసింది. అనంతరం పొందూరులో చేనేత మగ్గాలను ఇంటాక్ బృందం పరిశీలించింది.

ఉద్దానంలో ఎక్కడ సమస్య ఉన్నా మావంతు సాయం

ఉద్దానం హెల్పింగ్ సొసైటీ

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు మండలం గడూరు గ్రామనికి చెందిన అనిల్ కు గత నెలలో రాత్రి పది గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న విషయం తెలిసిందే. పేదరికం వల్ల వైద్యం కోసం అవస్థలు పడుతున్నారని కనీసం మందులు కూడా కొనలేని పరిస్థితులని తెలుసుకున్న యుహెచ్ఎస్ సేవా సంస్థ సభ్యులు ముందుకు వచ్చి తమ వంతు సహాయంగా రూ.6 వేలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో చంటి, జోగారావు, రాజేష్, చందు, జీవన్, నీలకంఠం, అజాద్, అమన్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన సంపాదన నుండి నిస్సహాయులకు సహాయం చెయ్యడానికి ముందుకు రావాలని, ఉద్దానం ప్రాంతంలో ఎక్కడ సమస్య ఉన్న మా వంతు సహాయం ఎప్పుడు ఉంటుందని తెలిపారు.

అల్పపీడనంతో అన్నదాతల్లో అందోళన

భారీ వర్షాలు పడితే రైతు కుదేలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఈ ఏడాది వరి పంట బాగా పండింది ఫర్వాలేదు అనుకున్న సమాయానికి బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని దీని కారణంగా భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సమాచారంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన వంట తుపాను రూపంలో తమకు ఎక్కడ దక్కకుండా పోతోందోనని భయాందోళనకు గురవుతున్నాడు. మండలంలో రైతులు ఈ ఖరీఫు సీజన్‌లో వంశదార కాలువలు, ఎత్తిపోతల పథకాలు, జీవగెడ్డలు, చెరువుల కింద వరి సాగు, మెట్ట ప్రాంతంలో కూరగాయపంటలు పండిస్తు న్నారు. ఈ యేడాది రైతులు సుమారు 12వేలు హెక్టార్లులో వరిసాగు, 2వేలు హెక్టార్లులో కూర గాయలు, 2 హెక్టార్లులో కంది, ఉలవ తదితర పంటలు సాగు చేపట్టారు. ఖరీఫు ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా కురవకపోయిన వంశధార కాలువ ద్వారా వచ్చే నీటితో చెరువుల కింద వ్యవసాయం సాగించే రైతులు ముందుగా వరినాట్లు వేశారు. తరువాత అప్పుడప్పుడు వర్షాలు కురవడంతో ఇక వరి పంటకు ఇబ్బంది లేదనుకున్న రైతులకు ఇప్పుడు తుఫాను వచ్చే ప్రమాధం ఉందన్న వాతావారణశాఖ హెచ్చరిక లతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం మండలంలో కొన్ని గ్రామాల్లో అడపాదడపా వరి కోతలు ప్రారంభం కావటం, కోతకోసి పోలాల్లో ఎండుతుండడంతో ఇప్పుడు ఈ తుఫాన్ ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి చిన్న చిన్న చినుకులు, గాలులతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. మరో పది రోజుల్లో పంట ఇంటకి వచ్చేదని, మొన్న తుఫాన్ బారినుంచి తప్పుకున్నామంటే మళ్లి ఈ తుఫాన్ మమ్మలను వెంటాడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : నవంబరు 21వ తేదీన జరగబోయే ప్రపంచ మత్స్యకార దినోత్సవం విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు పి.గురయ్యనాయుడు, ఉదయ్ కుమార్‌లు అన్నారు. బుధవారం శివసాగర్ బీచ్ వద్ద ఉన్న శ్రీనీలకంతేశ్వర ఆలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గల మత్స్య కారులందరు పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొమర దేవరాజు, చొక్కర నరహరి, తిర్రి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపిపి వంక రాజు, దాసరి పాపారావు, దొంక విద్యాసాగర్, యంపల్ల యోగి, సాతుపల్లి శేషయ్యులు పాల్గొన్నారు.

పీఓ తీరుపై అంగన్వాడీలు నిరసన

విశాలాంధ్ర-పలాస : తాత్కాలిక అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టు భర్తీలో ఐసిడిఎస్ పి.వో శార్వాణి తీరుపై అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. పలాస ఎంపిడివో కార్యాలయంలో బుధవారం ప్రాజెక్టు స్థాయి సమావేశం ఐసిడిఎస్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిడిపివో శార్వాని తాత్కాలిక సూపర్‌వైజర్ పోస్టులు భర్తీపై సిఐటియు నాయకులు ఎన్.గణపతి అంగన్వాడీ కార్యకర్తలు నిలదీశారు. డిగ్రీ, పి.జీ అర్హతలు కలిగి, సీనియారిటీ ఉన్న వారిని విస్మరించి 10వ తరగతి విద్యార్హత ఉన్న వారికి ఎలా నియామకాలు చేపట్టారని నిలదీశారు. దీనిపై సిడిపివో మాట్లాడుతూ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పడం వల్లే నియమించామని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీలు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రమోషన్లు కోసం ఎదురు చూస్తూ ఉంటే అడ్డగోలుగా నియామకాలు చేపట్టడం వలన అన్యాయానికి గురవుతున్నామని అన్నారు. కార్యక్రమంలో బి.సునీత, కె.జ్యోతి, బి.నిర్మల, డిల్లేశ్వరి, లోహితాక్షి, కె.కృష్ణవేణి, అప్పలనరసమ్మ, బి.చామంతి, ఎల్.దమయంతి, ఆదిలక్ష్మీలు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

వ్యవసాయ సహాయ సంచాలకులు మధుబాబు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: రైతులు మేలైన యాజమన్య పద్ధతులు పాటించాలని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల మధుబాబు అన్నారు. బుధవారం మండలంలో గల రామచంద్రపురం రైతు భరోసా కేంద్రంలో వైయస్సార్ పొలంబడి కార్యక్రమంను నిర్వహించారు. అందులో భాగంగా పొలం యొక్క పరిసరాలు పరిశీలన చేయడం జరిగిందన్నారు. రైతులకు పురుగుమందులు పిచికారి సరైన సమయంలో సరైన మోతాదులో మాత్రమే పిచికారి చేయాలని, వీలైనంతవరకు పురుగు మందుల పిచికారిని తగ్గించాలని సూచించారు. అధికంగా పురుగుమందులు పిచికారి చేయడం వల్ల మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. సమగ్ర

యాజమన్య పద్ధతులు పాటించడం వలన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు. రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించి అధిక దిగుబడి సాధించాలంటే వ్యవసాయ అధికారులు సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల వ్యవసాయధికారి దానకర్ణుడు, సర్పంచ్ గూడ వసంత కుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు నరేంద్ర కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సమన్యాయం



విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రతి ఒక్కరికి న్యాయవ్యవస్థ అందుబాటులో ఉండేందుకే డోర్ టు డోర్ లీగల్ అవేర్నెస్ కల్పిస్తున్నామని ఆముదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షులు కనితి విజయలక్ష్మి అన్నారు. బుధవారం డోర్ టు డోర్ ర్యాలీ నిర్వహించి కళాశాల మైదానంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఇంటింటికి న్యాయ విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అప్పీలు లేని తీర్పు-లోకదాలతో తీర్పు, అందరికీ న్యాయం-అందుబాటులో న్యాయం, సమన్యా యం - సత్వర న్యాయం, నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బార్ కౌన్సిల్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సభ నిర్వ హించారు. పలువురు న్యాయవాదులు సమా చార హక్కు చట్టం గురించి, బాల్య వివాహాల గురించి, ఆస్తి తగాదాల గురించి, లోకదాలత్ గురించి వివరించారు. దేశం బాగుపడాలంటే న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉండాలి, న్యాయంగా అందరికీ న్యాయం జరగాలని పలువురు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ బి. శ్యాంసుందర్, అధ్యాపక అధ్యా పకేతర సిబ్బంది, న్యాయవాదులు గోవిందరావు, కే.త్రినాథ రావు, వి రాజేశ్వ రరావు, పి.అమ్మన్ నాయుడు, బి. మోహన్‌రావు, ఎస్. ప్రసాదరావు, హెచ్. అచ్చం నాయుడు, పి మోహన్ రావు, బి జోగారావు స్టేషను హౌస్ ఆఫీసర్, ఆమదాలవలస కోర్టు సిబ్బంది పోలీస్‌శాఖ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న భూ రక్ష సర్వే రాళ్లు

విశాలాంధ్ర-ఆమదాలవలస : జగనన్న భూ రక్షలో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు భూములను తెలిపే విధంగా సర్వే రాళ్లను వేసేందుకు సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కట్యా చార్యులపేట పంచాయతీ పరిధి హనుమంతు పురం రెవెన్యూ గ్రామంలో వై యస్ ఆర్ జగనన్న భూ రక్ష పథకం లో బాగంగా ప్రభుత్వ భూములకు మరియు జీరాయితి భూములకు మధ్యన సరి హద్దు రాళ్ళను బుధవారం కొబ్బరి కాయ కొట్టి పాతించడం జరిగినది. ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూ రక్ష పథకం ను రైతులందరూ సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ అధికారులకు రైతులందరూ సహకరించాలి అని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు

కోరారు. ఈ విధానం ద్వారా జిరాయితీ భూములు సంరక్షించు కోవచ్చని తెలిపారు. అలాగే ప్రభుత్వ భూములను కబ్జా కి గురికాకుండా చూడవచ్చని, ఆ భూములను గ్రామ అవసరాలకు ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకోవడం జరుగు తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న హరిశ్చంద్రపురంలో చాగంటి ప్రవచనాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చిన్న హరిశ్చంద్రపురం శ్రీ పంచదామక్షేత్రంలో ఈనెల 21వతేదీ కార్తీక నాల్గువ సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాంగటి కోటేశ్వరరావుచే ప్రవచన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలు హజరుకావాలని ఆలయ వ్యవస్థాపకులు ఉప్పాడ కనకరాజు బుధవారం తెలిపారు. అలాగే వేద పండితులు బంకుపల్లి సుబ్రమణ్యశర్మ ఆధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో సాయింత్రం 6 గంటల నుంచి లక్ష దీపారాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అలాగే లక్ష ఒక్క శివ లింగాలు ప్రతిష్టలో భాగంగా చాలా మంది భక్తులు క్షేత్ర ప్రాంగణంలో శివలింగాలు ప్రతిష్ఠ చేయటం జరుగుతుందని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తోటి జనసైనికుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కొజ్జిరియ గ్రామానికీ చెందిన ఉప్పాడ వరప్రసాద్ అనే జనసైనికుడు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ దాసరిరాజు తోటి జనసైనికులతో కలిసి వర ప్రసాద్ కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ మేరకు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మనోధైర్యాన్నిచ్చారు. అలాగే జన సేన పార్టీ తరపున కమలాయిపుట్టుగ, కొజ్జిరియ జనసైనికులు ఉమ్మడిగా 12 వేలు రూపాయలు ఆర్థిక సహాయం వరప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిప్పిన దుర్యోధన రెడ్డి,కొజ్జిరియ జనసేన ఎంపీటీసీ అభ్యర్థి లింగరాజు పనపాన, జనసైనికులు పాల్గొన్నారు.

బిరుసువాడలో గడప గడపకు కార్యక్రమం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మేజర్‌ప ంచాయతీ బిరుసువాడ గ్రామంలో బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ నేతృత్వంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సోంపేట, కంచిలి ఎంపిపిలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాసురెడ్డి, స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్‌లు నగిరి ప్రభావతమ్మ, మల్లా వెంకటరమణ, పార్టీ శ్రేణులు పాల్గొని ఈ కార్యక్రమం ద్వారా అనేక మందిని కలిశారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పొందుతున్న లబ్ధి, సంక్షేమ పథకాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-భామిని : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి బాక్సింగ్ కు ఏ.పి. మోడల్ స్కూల్ భామిని విద్యార్థులు అండర్ 17 విభాగంలో కె. మహాలక్ష్మి, (9 వ తరగతి) కె. జస్వంత్ (జూనియర్ ఇంటర్), అండర్ 14 విభాగంలో ఏ. జస్వంత్ (8 వ తరగతి) టీ. సాయి నిశాంత్ (8 వ తరగతి) అర్హత సాధించరని శ్రీకాకుళం జిల్లా బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. శివకుమార్ వ్యాయామ ఉపాధ్యాయులు శివరాం ప్రసాద్, అభినందనలు తెలియజేశారు.

మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-భామిని : మావోయిస్టు ప్రభావిత తువ్వాకొండ గ్రామాల్లో పోలీసు బందోబస్తు మధ్య, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మండలం, బొడ్డగూడ గ్రామ సచివాలయంలో పరిధి బంద్రసింగి, కొటకొండ, కదంబాసింగి గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గ్రామాలలో ప్రతీ గడపకు వెళ్లి ఆదివాసీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి అందుతున్న పోడు భూములకు రైతు భరోసా, వృద్ధులకు, వితంతులకు పింఛన్ల, సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను మా గ్రామాల్లో నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందించగా అధికారులకు నివేదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బిడ్డిక మార్త, అనంత రావు, వైస్ ఎం.పి.పి బోనగడ్డి ధర్మారావు, తోట సింహాచలం, సర్పంచ్ కొండగొర్రి, చంటి, వైస్ ఎం.పి.పి బోనగడ్డి ధర్మారావు, మజ్జి మోహనరావు గెళ్ళంకి రమేష్, కొవ్వాడ చిరంజీవులు మజ్జి జగదీష్, సచివాలయ సిబ్బంది ఆర్టికల్చర్ యార్రన్న, పంచాయతీ కార్యదర్శి గొర్లే చిన్నబాబు, ఆరీక చంద్రశేఖర్, ఎన్ని సాయికుమార్, బిడ్డిక సుమలత, పి మత్తయ్య, బి జగ్గారావు, ఎన్ ఏర్రకం, ఎన్ విజయబాబు ఎస్. ఐ సీతారాములు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.